# పోతరాజు చదువు

★ సుందరి ★

పోతరాజు ఆ పల్లెటూరిబళ్లో ఐదోక్లాసుప్యాసై ఇంక మీదికి చదువుదామంటే ఆ బడిలో లేనందున తనపల్లెటూరికి ఐదారుమైళ్ల దూరంలో వున్న బస్తీలోని హైస్కూల్లో ఫస్టుఫారంలో చేరేడు. ఆ చిన్న బస్తీయేపోతరాజుకు ఎంతో ఘనంగా కనిపించసాగింది. ఆ హైస్కూల్లో తన ఈడుపిల్లలందరూ, తనకంటే తనగ్రామపు దూడలు కాసుకునే పశువుల కుర్రాళ్లకంటే ఎంతో నాగరికతగా కనుపించసాగారు.

తనుకూడా ఆ బస్తీ పిల్లలల్తో సమానంగా ఏమాత్రం వెలితిపడకుండా వుండేందుకు తన గ్రాఫులోను, దుస్తుల్లోనూ తీరులోను అన్నిటిలో మార్పులు తీసుకువచ్చాడు. తనుకూడా బస్తీ కుర్రాణ్ణయ్యాననుకున్నాడు. కాని తనకు పోతరాజు అను పేరు ఏంబావుంటుంది. పేరుమార్చేశాడు. రాజారావు అని షోగ్గా. ఇప్పుడిక పోతరాజు కాదు రాజారావే.

రాజారావు సిగరెట్లు సినిమాలు అలవాటు చేసుకుని మొత్తానికి స్కూలుఫైనలు గట్టెక్కించాడు, తండ్రి సుబ్బయ్య "ఇంక చదువు చాల్లేరానాయనా! ఏదో ఇల్లువాకిలి, పొలంపుట్ర చూసుకుంటూ ఇంట్లో కూర్చోరాదురా" అన్నాడు. కాని రాజారావుకు ఆ తండ్రిమాటలు నచ్చలేదు. తనకింకా పట్నం వెళ్లి పెద్ద పెద్ద చదువులుచదివి మంచి ఉద్యోగ హోదాలో వుండాలని వుందని తన మనసులో మాట చెప్పేడు. తండ్రి కొడుకు మాటకు అడ్డు చెప్పడం ఇష్టంలేక సరి అన్నాడు. కొడుకు పట్నం వెళ్లి ఎవరినైనా మరుగుతాడేమోనని భయం చేత చిన్నతనంలోనే ఒక పెద్దింటి పిల్లను తీసుకు వచ్చి కట్టబెట్టేశాడు.

రాజారావుని తల్లి తండ్రి ఆశీర్వదించి పంపిచారు, రాజా ఇంటర్లో చేరినాడు. కాలేజిలో పెద్ద పెద్ద ఆడపిల్ల విచ్చలవిడి. మొగపిల్లల వేష భాషలూ, మొగపిల్లలూ, ఆడపిల్లలూ కలిసి జల్సాగా, సోషల్‌గా మాట్లాడుకోవడం, ఆ వుభయవర్గాల కేరింతలు ఇవన్నీచూస్తూంటే రాజాకు తలతిరిగిపోతూంది. అవును, రాజాకు తలతిరిగిందంటే ఆశ్చర్యమేముంది. తనెప్పుడూ చూడని సంఘటనలు ప్రత్యక్షంగా తనకళ్లయెదుట జరుగుతున్నాయి. తనపల్లెటూరులో పన్నెండేళ్లు దాటకుండా పెళ్లిచేసిపరపురుషునికంటపడకుండాకట్టుదిట్టములో వుండే పల్లెపడుచుల ముందర ఈ సంపూర్ణ యౌవ్వనంలోయున్న సుందరాంగుల విచ్చలవిడి రాజాకు అమితాశ్చర్యకరమైంది.

ఆ నాగరికుల ముందర తనకు ఏమాత్రం తీసికట్టుగా వుండడం ఇష్టంలేక పోయింది. తనూ వాళ్లలా వుండడానికి నిశ్చయించుకున్నాడు. రాజా మునుపటి లాగులూ కంటిమీద లాల్చీలు మానేసి ట్వీడుపాంట్లూ బుష్‌కోట్లూ, సూటు బూటు అంతా వేషంమొదలెట్టాడు సన్‌గుర్సీ చూసి. అందరి యువకుల మాదిరే తనూ పైకిదువ్వడం, దిలీపకుమార్ లాగా ఆ జుట్టు నుదిటిమీద పడేసుకోవడం ఫ్రెంచికటింగుమీసం జేబురుమాల పాంట్ జేబులో అర్ధాన్నంగా కనపడేటట్లు పెట్టుకోవడం నేర్చుకున్నాడు. రాజా తన వేషాన్నైతే మార్చగలిగాడు కాని తనబుద్ధి నెలా మార్చగలుగుతాడు. తన కసలు ఆడవాళ్లంటే భయం. అందులోనూ ఈ మిడిసిపడే నారీమణులంటే అసలే గుండెదడ. మళ్లీ వాళ్లని చూడాలని కోరిక. మాట్లాడ్డానికి ధైర్యంచాలదు. యువకులందరు వాళ్లతో అంత ఇదిగా మాట్లాడుతూంటేనే తప్పుపట్టుకొని ఆడపిల్లలని తను ఒట్టి కళ్లతోచూస్తేమాత్రం తప్పేముంది? అనుకున్నాడు. పాపం రాజా ఎవరైనా గరల్ స్టూడెంటు కనపడే

సరికి ఆమెని ఎగాదిగా చూడ్డం మొదలెట్టాడు. ఆతీరు ఆముస్తాబు అంతా క్రిందినుండి మీది దాకా రెండు కళ్లు అప్పగించి చూసేసరికి ఒక జవ్వని అమాంతంగా "ఏం. అలాచూస్తావు. దెయ్యంపట్టినవాడిలాగ. మాట్లాడవేం ఏంకావాలి" అని దుబాయించింది. రాజా జంకుతూ అడుగులు వెనక్కి వెనక్కి వేస్తూ "అ.... ఏం....లేదు.... లేదు."అనిగొణిగాడు. ఆ యువతి పకపక విరగ బడి నవ్వుతూ "నన్నుచూసి అంత భయపడి పోతావెందుకూ, మింగేస్తాననుకున్నావా" అని నాలుగు మాటలు అనేసి చరచరా వెళ్లిపోయింది. రాజాకు మాత్రం తలతెగినట్లు అయింది. ఆడు దానిచేత ఎంత అవమానం అని క్రుంగిపోయాడు. ఆ అమ్మాయి నవ్వు ఆతనికి ఎంతో విషప్రాయమైంది. ఆ అమ్మాయికి తగిన శాస్తిచేయాలని సంకల్పించుకొన్నాడు.

మరునాడు ఆ అమ్మాయి షోగ్గా తయ్యారై టీప్‌టాప్‌గా నడచి కాలేజీకి వస్తూయుండడం రాజా చూచి అతిక్రోధంతో ఓహ్ ఇదేగా నన్నవమానించింది దీనిపని చెప్పాలి అనుకుంటూ గబ గబా నడచివచ్చాడు. జోరుగా నడచి పోతూయున్న అమ్మాయిని సమీపించి లేనిధైర్యంతెచ్చుకుని "ఏమే అమ్మాయి ఇలాచూడు నిన్నే" అని గర్జించాడు. ఆ అమ్మాయి ఫెడేమని "పోరావిలేజి బ్రూట్ నీతో నాకేమిటి అని తనదారినివెళ్లిపోయింది. దాంతో మరింత కుపితుడై అవమానం దిగమ్రింగి ఇక ఆడపిల్లలజోలికి ఎన్నడూ పోగూడదని నిశ్చయించుకున్నాడు,

రాజాకు సుధాకర్ అనేవాడు. స్నేహితుడు; ఇద్దరూ ఒకరూము లోనేకూడా ఉంటున్నారు. అంచేత ఇద్దరూ బాగా ఫ్రెండ్సు అయ్యారు. ఆడపిల్లలతో సోషల్‌గా తిరిగే మొగాళ్లందరికంటే సుధాకర్ నాలుగాకులు ఎక్కువే కాని తక్కువ మాత్రంగాదు.

సుధాకర్ ఆడపిల్లలని టీ కాహ్వానించడం, వాళ్లకి రాజాని ఇన్‌ట్రడ్యూస్ చేయటం, వాళ్లు వెంటనే హల్లో రాజా అని షేక్‌హాండ్ ఇవ్వడం, రాజా జంకుతూ వణికే చేతులతో ఆడపిల్లల చేతులు కలపడం, వాళ్లు పొట్టవిచ్చేలాగున నవ్వడం జరుగుతూ యుండేది.

రాజా పుట్టి బ్రాక్ అని పేరుపడ్డాడు. పైపెచ్చువిలేజిబ్రూట్ అనికూడా. రాజాకి ఈఅవమానం సహించ రానిదయింది. తన వేషమామార్చుకున్నాడు. తీరా అంతరంచే మార్చుకున్నాడు. ఇంక ఏంచేయగలడు! కొత్త సూట్లు, బుష్‌కోట్లు, సెంటు రుమాళ్లు అన్నీ దండగేకాని తన్నెవరూ ఆకర్షించే వారేలేరు. పైగా ఎగతాళి పాలైనాడు. రాజాకు తనతోటి స్టూడెంట్సుతో సమానంగా ఎలావుండాలి, వాళ్ళతో ఎలా గౌరవంపొందాలి, ఇదే ఆలోచన. ఈ ఆలోచలతో పాఠాలుగూడా సరిగ్గా చదవలేక పొయ్యేవాడు. ఆడపిల్లలని చూస్తే ఒక తంటా, చూడకపోతే ఒక తంటా. చూస్తే నీకేం పనిలేదా ఎందుకలా చూస్తావు అని చెంపకాయ కొట్టినట్టు అడుగుతారు, చూడకపోతే పట్టి పిరికి పంద శుద్ధఫూల్‌లావున్నాడు అంటారు. ఇలాఅవమానంతో ఈ పట్నం ఎందుకు వచ్చానురా భగవంతుడాఅని ఏడుస్తూ ఆసంవత్సరం గడిపాడు. ఎండాకాలంశెలవులకు ఇంటికివచ్చాడు. అందరూ చుట్టూ మూగారు. పోతరాజు ఎంత మారిపోయ్యాడో అంటూ నోరులు నొక్కుకోవడం మొదలు పెట్టినారు. మాపోతిగాడు ఎన్ని వేషాలు నేర్చుకున్నాడు అని మురిసిపోయింది తల్లి. రాజాకు మనస్సులో పట్నంలో జరిగిన అవమానం తల్చుకుని ఇంకెప్పుడూ ఆపట్నం పొలిమేర త్రొక్కగూడదనుకున్నాడు ఈ పల్లెలో తనకెంత గౌరవం! ఎప్పుడూ ఇక్కడనే వుండిపోతే ఎంత బాగుంటుంది అనుకున్నాడు.

తండ్రితో తను ఇక పట్నం వెళ్లి చదువనని ఇక్కడనేవుండి భూముస్తులు చూసుకుంటూ వుండిపోతానని, చెప్పివేశాడు. తండ్రి "ఆదేమిట్రా నాయనా మొదలెట్టిన చదువేనా పూర్తి కావొచ్చు ఇంకొక్క సంవత్సరమేగా" అన్నాడు. "నాకు ఇంక చదవాలని లేదు నాన్నా ఇక అసలు ఎక్కడికి కదలను. ఇక్కడనే వుండిపోతాను" అన్నాడు రాజారావు. నేనుముందే చెప్పాను గదురా ఇక ఈ చదువు చాల్లేరా నాయనా అని తండ్రి అనగా రాజా మనస్సులో ఆమాటే విన్నాను కాదు అనుకున్నాడు.